
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 7 । జూన్ । 2025



సోమశిలలో 40.980 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 40.980 టీఎంసీలు ఉన్నాయి. 345 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండా. డెల్టాకు 3.280, ఉత్తర, దక్షిణ కాలువలకు 650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,270
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,087
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,360
నవర (8 గ్రాములు)	రూ.74,880

గరిష్టం/కనిష్టం
40.4 /29.6

వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు మళ్లీ తీవ్రమవున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో తేమ 53 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 461 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 312 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 149 బేళ్లను తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి టి. ఇషాక్‌స్వర్ణదత్ మాట్లాడుతూ కనిష్ట ధర రూ.180 పలకగా, సగటు ధర రూ.238.49 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 515 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 515 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 764 బేళ్లు రాగా 515 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 66686.8 కిలోల పొగాకును విక్రయించగా రూ.14995278.60 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ట ధర రూ.280 కాగా కనిష్ట ధర రూ.180 లభించింది. సగటున రూ.224.86 ధరగా నమోదైంది. వేలంలో 8 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ డీసీ బాధ్యతల స్వీకరణ



నూతన డీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఈఓ ఎ. శ్రీనివాసులునాయుడు

నెల్లూరు(క్రైమ్): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎం. శంకరయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పి. దయాసాగర్, డీపీఈఓ ఎ. శ్రీనివాసులునాయుడు, ఏఈఎస్ జే రమేష్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు డీసీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీసీ జిల్లాలో ఎక్సైజ్ నేరాలు, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

- తొలిరోజు 117 మంది గైర్హాజరు



పరీక్షకు హాజరై బయటకు వస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

నెల్లూరు (టౌన్): డీఎస్సీ పరీక్ష తొలిరోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 5 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో జరిగాయి. ఈ పరీక్షకు ఉదయం 679 మందికి 63 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 675 మందికి 54 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందుగా కేంద్రంలోకి అనుమతించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమంది పిల్లలతో కలిసి పరీక్ష కేంద్రానికి వచ్చారు.


డీసీసీబీ, డీసీఎమ్మెస్ చైర్మన్ల బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్మెస్) చైర్మన్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీ కార్యాలయంలో మెట్టుకూరు ధనుంజయరెడ్డి, స్టోన్‌హౌస్‌పేటలోని డీసీఎమ్మెస్ కార్యాలయంలో గంగోటి నాగేశ్వరరావు బాధ్యతలు వేదపండితుల ఆశీర్వచనాలతో చేపట్టారు. ఈ సందర్భంగా మెట్టుకూరు మాట్లాడుతూ తాను రెండోసారి డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం గర్వంగా ఉందన్నారు. షేర్ హోల్డర్స్‌కు, బ్యాంకు ఉద్యోగులకు బోనస్ అందించేలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, డీసీఓ గుర్రప్ప, డీసీఏఓ తిరుపతయ్య, డీఎల్ సీఓ తిరుపాల్‌రెడ్డి, బ్యాంకు సీజీఎం సరిత, డీజీఎం ఉషారాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ఆరోగ్యం

కూటమి పాలనలో ప్రజారోగ్యం ఆపదలో పడింది. ప్రభుత్వ ప్రాధాన్యత, బాధ్యతల్లో ఒకటైన వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం దేశ స్థాయిలో ప్రాధాన్యతను సంతరించుకుంది. అటువంటి పథకాన్ని టీడీపీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మరిన్ని జబ్బులు, ప్రొసీజర్లను చేర్చి తిరిగి ఆరోగ్యశ్రీకి పునర్జీవం పోశారు. తాజాగా మరోసారి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని కుప్పకూల్చేస్తోంది.



నెల్లూరు (అర్బన్): కార్పొరేట్ వైద్యాన్ని పేద రోగుల చెంతకు చేర్చి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మరింత ప్రాధాన్యత కల్పించారు. 3,255 జబ్బులు, ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీలో చేర్చారు. ఆపరేషన్ జరిగి కోలుకున్నాక ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయానికి కూడా నగదు అందిస్తూ ఆరోగ్య ఆసరా పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారు. ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం పొందేలా జీఓ తెచ్చారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఆరోగ్యశ్రీ, ఆసరా, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ లాంటి పథకాలను కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యం చేస్తోంది. పేదలకు ఆరోగ్య ఫలాలు అందకుండా చేస్తోంది. పేదలకు ఆరోగ్య భరోసా లేకపోవడంతో జబ్బు వస్తే ప్రైవేటు వైద్యం కోసం వెళ్లి పేదలు అప్పుల పాలవుతున్నారు. 104 వాహనాల ద్వారా పీహెచ్‌సీ డాక్టర్లు ఫ్యామిలీ డాక్టర్ పేరుతో గ్రామాల్లోనే వైద్య సేవలందించారు. సంవత్సరానికి 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మందికి ఓపీ సేవలందించేవారు. మళ్లీ చంద్రబాబు సీఎం అయ్యాక ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పోయింది. డాక్టర్లు గ్రామాలకు రావడం లేదు. రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆరోగ్య ఆసరాకు ఎసరు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేద ప్రజలు వైద్యం చేయించుకుని డిశ్చార్జి అయ్యాక కొంత కాలం విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కాలంలో వారు పనులకు వెళ్లేందుకు శక్తి ఉండదు. రోజు గడవడమే కష్టంగా ఉంటుంది. అప్పులు తెచ్చుకుని బతకాలి. లేదా పస్తులతో గడపాలి. దీంతో రోజుకు రూ.225 చొప్పున డాక్టర్లు సూచించిన సమయం వరకు విశ్రాంతి భృతిని ఇచ్చేందుకు ఆరోగ్య ఆసరా పథకాన్ని 2019 డిసెంబర్ 2న ప్రారంభించారు. ఆపరేషన్‌ను బట్టి రోగుల బ్యాంకు ఖాతాల్లో రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు నగదు జమయ్యేది. ఇలా 2024 అక్టోబర్ వరకు 1.30 లక్షలకు పైగా పేద రోగులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మూడు నెలలు మాత్రమే ఆరోగ్య ఆసరా పథకాన్ని సక్రమంగా అమలు చేసింది. అనంతరం ఒకరు, అర మాత్రమే ఆసరా నగదును పొందారు. అక్టోబర్ నెల నుంచి రోగుల బ్యాంకు ఖాతాల్లో ఆసరా నగదు జమ కావడం లేదు.



పెద్దాస్పత్రిలోని క్యాజువాలిటీ(ఎమర్జెన్సీ) విభాగం



ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఆరోగ్య మిత్ర వద్ద ఫొటోలు దిగేందుకు వచ్చిన రోగులు

వైఎస్ జగన్ పాలనలో ఆసరా లబ్ధిదారులు

సం॥	ఆసరా లబ్ధిదారులు	అందిన సాయం రూ.కోట్లలో
2019-20	6671	4.11
2020-21	18,565	10.42
2021-22	33,863	16.94
2022-23	37,286	18.55
2023-24	39,888	22.39
2024-25	18,845	10.31

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు గండం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకున్న పేద మహిళలను ఉచితంగా భద్రంగా ఇంటి వద్ద వదిలి పెట్టేందుకు 102 (తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్)ను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. పది వాహనాలను ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేసింది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ముగ్గురు, నలుగురు కాన్పులు అయ్యేదాక ఉండి అందరినీ ఒకే వ్యానులో ఎక్కించుకుని పైలట్ వెళ్లేవారు. అయితే పేద రోగుల ఇబ్బందులు తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చాక జిల్లాలో అప్పటి వరకు ఉన్న 10 వాహనాలను 19కి పెంచారు. తల్లి,బిడ్డ, మరో కుటుంబ సభ్యుడిని తీసుకుని ఇంటి దగ్గర క్షేమంగా వదిలి వచ్చేలా ఏర్పాటు చేశారు. పెద్దాస్పత్రిలో రోజుకు 14 నుంచి 20 వరకు కాన్పులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మూడు నెలలుగా ఏజెన్సీకి నిధులివ్వకపోవడంతో ఆ వాహనాలు ఆపేశారు. జిల్లాలో తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు 19 ఉండగా కేవలం 13 మంది పైలట్లు మాత్రమే ఉన్నారు.



108 వాహనాలు.. ఆప సోపాలు

చంద్రబాబు కాలంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 20 వాహనాలు మాత్రమే ఉండేవి. వాటిలో కూడా 7 వాహనాలు ఎప్పుడూ రిపేర్లకు గురవుతూ ఉండేవి. టైర్లు అరిగి పోయి ఏక్షణాన పేలిపోతాయో అనే పరిస్థితి ఉండేది. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాత వాహనాల స్థానంలో కొత్తవాహనాలను ఏర్పాటు చేశారు. మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 38 వాహనాలు ఏర్పాటు చేశారు. వారికి ఏజెన్సీ ద్వారా సకాలంలో జీతాలు వచ్చేవి. అయితే చంద్రబాబు మళ్లీ అధికారం చేపట్టాక వారికి కష్టాలు తప్పడం లేదు. గత రెండు నెలలుగా జీతాలు రాలేదు. అప్పులతో గడుపుతున్నారు.

క్రమక్రమంగా ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం పావులు కదుపుతోంది. అందులో భాగంగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) నెట్ వర్క్ ఆస్పత్రులకు నిధులు విడుదల చేయలేదు. జిల్లాలో 132 ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. ఇటీవల నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెకు దిగడంతో కొంత వరకు నిధులు విడుదల చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారు. అయితే రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు సేవలందించి తర్వాత ఆరోగ్యశ్రీ పరిధి అయిపోయిందంటూ బయటకు పంపుతున్నారు.

గత ఐదేళ్లలో అందిన సేవలు

సం॥	రోగులు	చెల్లించిన మొత్తం రూ.కోట్లలో
2019-20	44,423	122.79
2020-21	45,143	108.32
2021-22	52,456	139.46
2022-23	69,857	148.72
2023-24	51,607	114.85
2024-25	43,842	96.01

ప్రభుత్వ వైద్యం అంతంత మాత్రమే

జిల్లాలో ఒక సర్వజన ఆస్పత్రి, 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, 28 యుపీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి, రెండు ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. అయితే ఈ ఆస్పత్రుల్లో పలువురు డాక్టర్లు సమయానికి వచ్చి థంబ్ వేసి వెళ్లిపోతున్నారు. సొంత క్లినిక్‌ల్లో సేవల్లో మునిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో పేదలకు వైద్యం గగనమవుతోంది. కొన్ని రకాల దగ్గు మందులు, షుగర్‌కు ఇన్సులిన్ అందుబాటులో ఉండటం లేదు. మరికొన్ని యాంటీబయాటిక్స్ కూడా అందుబాటులో ఉండడం లేదు. కూటమి ప్రభుత్వంలో రోగులకు సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మా బాధలు పట్టించుకోవాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు జరిగే పేద మహిళలకు ఎంతో ఉపయోగపడుతున్న 102 తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేస్తున్న మాకు అతి తక్కువగా జీతం రూ.7,870 ఇస్తున్నారు. జీతాలు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేష్‌లకు వినతి పత్రాలు ఇచ్చాం. కలెక్టరేట్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేశాం. ఇంత వరకు కూటమి ప్రభుత్వం తమ బాధలు పట్టించుకోలేదు. – సునీల్‌రెడ్డి, పైలెట్, 102 తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు

జీతాలు లేక మానేస్తున్న పైలట్లు



102 తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో కూటమి ప్రభుత్వంలో ఏజెన్సీ మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. ఇచ్చేది అరకొర వేతనాలు. అవి కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో ఉన్న 19 మందిలో 6 మంది పని మానేశారు. దీంతో కాన్పులు జరిగిన మహిళలను సకాలంలో ఇళ్లకు చేర్చాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలి. పీఎఫ్, వీక్లీ ఆఫ్ సౌకర్యాలు కల్పించాలి. – మహేష్, 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అసోసియేషన్ సెక్రటరీ

గతంలోనే ప్రభుత్వ ఆస్పత్రులు బాగున్నాయి



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం బాగా అందేది. ఇప్పుడు డాక్టర్లు సరిగా ఉండడం లేదు. పెద్దాస్పత్రిలో కూడా డాక్టర్లు పరీక్షలు రాసిస్తారు. అవి చేసుకుని రిపోర్టులు వచ్చే లోపు రాసిన డాక్టర్లుండటం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – పద్మ, బుజబుజనెల్లూరు

సాంఘిక సంక్షేమ శాఖలో ఫెవికాల్ ఉద్యోగులు

- 14 ఏళ్లుగా ఒకే స్థానంలో తిష్టవేసిన కొందరు ఉద్యోగులు
- బదిలీల ప్రక్రియలో చక్రం తిప్పుతున్న లీడర్లు
- ఎక్కడి వారు అక్కడే
- నిబంధనలు పాటించకుండా తయారు చేసిన బదిలీల ఫైల్ తిరస్కరించిన డీఆర్‌ఓ





నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖలో బదిలీల ప్రక్రియలో ఉద్యోగ సంఘాల నేతలు చక్రం తిప్పుతున్నారు. పారదర్శకంగా జరగాల్సిన బదిలీలకు మసిపూసి మారేడు కాయ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలను పాటించకుండా ఎక్కడి వారు అక్కడే ఉండేలా, లేదంటే అటూ.. ఇటూ మార్పులతో జాబితాను తయారు చేశారు. దీంతో ఈ ఫైల్‌ను డీఆర్వో తిరస్కరించారు. దీంతో పలు అనుమానాలకు తావిస్తున్నాయి. అసంబద్ధ జాబితాతో బదిలీల కోసం వేచి చూస్తున్న వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఐదేళ్లు ఒకే స్థానంలో పని చేసిన వారిని కచ్చితంగా అక్కడి నుంచి బదిలీ చేయాల్సి ఉంది. ఇందులో ఒక ఏడాదిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండేవారు, భార్యాభర్తలు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన పిల్లల ఉన్న వారికి ఈ బదిలీల్లో మినహాయింపులు ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. అయితే సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ఈ నిబంధనలకు నీళ్లొదిలారు. ఖాళీల జాబితాలను ముందుగా ప్రకటించకుండానే కొందరు ఉమ్మడి జిల్లాలో పనిచేసే ఉద్యోగులు ఈ జిల్లాలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరు ఈ జిల్లాకు సంబంధించిన వారు కాదని తిరుపతి జిల్లాకు చెందిన వారిని చెప్పుకొచ్చారు. అయితే నెల్లూరు జిల్లాలోనే మరి కొంత మందిని తిరుపతి జిల్లాకు చెందిన వారిని ఇష్టమొచ్చినట్లు బదిలీలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో బదిలీల జాబితాను డీఆర్‌ఓ తిరస్కరించారని ఉద్యోగులు చెబుతున్నారు. నెల్లూరు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖలో యూనియన్ నాయకులుగా చెలామణి అవుతున్న సుమారు 12 మంది 14 సంవత్సరాలుగా ఒకే స్థానంలో పని చేస్తున్నప్పటికీ, వారిని మళ్లీ అదే స్థానాల్లో కొనసాగించేలా జాబితాను తయారు చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు ఉద్యోగ సంఘాల్లో పనిచేసే నేతలు 9 ఏళ్ల పాటు ఒకేచోట పనిచేసేలా మినహాయింపు ఉంది. ఆ తర్వాత కచ్చితంగా బదిలీ కావాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనలను సైతం పక్కన పెట్టి యూనియన్ నాయకులు వారి బదిలీలతోపాటు వారికి ఇష్ట మొచ్చిన వారికి, రాజకీయ పలుకుబడి ఉన్న వారికి, బదిలీల కోసం డబ్బులు పెట్టుకునే వారికి అండగా ఉంటూ ఇష్టమొచ్చినట్లు బదిలీలు చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ జీఓలను పట్టించుకోకుండా బదిలీల ప్రక్రియను చేస్తుండడం వల్ల ఉమ్మడి జిల్లాలో పురుష ఉద్యోగులతోపాటు మహిళా ఉద్యోగులు సైతం నష్టపోతున్నారు. యూనియన్ నేతలకు ఇష్టమైన వారికి అనుకూలంగా, వ్యతిరేకులు అయితే మరో రకంగా వ్యవహరిస్తూ బదిలీల జాబితా చేయడం, లోకల్ పాయింట్లను పట్టించుకోక పోవడం ఆరోపణలకు తావిస్తోంది. ఇదే సమయంలో బదిలీల ఫైల్‌ను డీఆర్‌ఓ తిరస్కరించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చినట్లు అయింది. ఈ నెల 2 నుంచి బదిలీల ప్రక్రియను 9వ తేదీ వరకు పొడిగించడంతో సాంఘిక సంక్షేమ శాఖలో బదిలీల ప్రక్రియలో నిబంధనలకు అతీతంగా ఎన్ని లీలలు జరుగుతాయో వేచి చూడాల్సిందే..

డీఆర్వో వద్ద బీసీ సంక్షేమ శాఖ ఫైలు

జిల్లా బీసీ సంక్షేమ శాఖకు చెందిన వార్డెన్ల బదిలీలకు సంబంధించిన ఫైలుకు డీఆర్వో వద్ద బ్రేక్ పడింది. యూనియన్ నేతల అండ ఉన్న వారికి కోరిన చోటుకు పోస్టింగ్ ఇచ్చేందుకు ఫైల్‌ను సిద్ధం చేసుకుని బేరసారాల కుదుర్చుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కొంత మేర యూనియన్ నాయకులు చెప్పిన పేర్లకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. అయితే ఈ ఫైల్ డీఆర్వో వద్ద బ్రేక్ పడడంతో ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. తాము ఉన్న చోటే ఉంటామని సంబరపడిన వార్డెన్లు సైతం తమను ఎక్కడికి బదిలీ చేస్తారోనని బెంబేలెత్తుతున్నారు. ఈ నెల తొమ్మిది వరకు బదిలీలకు గడువు ఉండడంతో మౌనంగా ఉన్నారు. మే నెల 31న క్లాస్- 4 ఉద్యోగుల బదిలీలు జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో హడావుడిగా జరిగాయి. అక్కడ కూడా యూనియన్ నేతలు జిల్లా అధికారి చాంబర్‌లోనే ఉండి మంతనాలు జరిపినట్లు సమాచారం. యూనియన్ నాయకుల బేరసారాలు ఫలితాలిస్తాయా, పారదర్శకంగా బలీలు జరుగుతాయా అనే విషయం కూడా ఈ నెల 9 వరకు వేచి చూడాలి.

నీకు భర్త లేడని రుజువేది?

- ఒంటరి గిరిజన మహిళకు పింఛన్ నిలిపివేత
- ఏడేళ్లకు పైగా ఇస్తున్నారని..
- టీడీపీ నేతల ఒత్తిడితోనే ఇప్పుడు ఆపేశారంటూ ఆవేదన



పింఛన్ నగదు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న దాసరి పద్మ

వెంకటాచలం: భర్త లేని ఒంటరి మహిళకు ఏడేళ్లుగా సామాజిక భద్రత పింఛన్‌ను ప్రభుత్వం అందజేస్తోంది. అయితే ఆమెపై కక్ష గట్టిన టీడీపీ నేతలు సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి జూన్ నెల నుంచి పింఛన్ ఆపేశారు. నీకు భర్త లేడని రుజువేదని, సర్టిఫికెట్ తెచ్చి ఇస్తే పింఛన్ ఇస్తామంటూ సచివాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని వెంకటాచలానికి చెందిన గిరిజనురాలు దాసరి రాధ ఆవేదన వ్యక్తం చేసింది. ఒంటరి మహిళ అయిన తనకు చాలా ఏళ్ల నుంచి పింఛన్ వస్తుండగా, ఆ డబ్బుతోనే తన కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది. జూన్ నెల పింఛన్ ఇవ్వకపోవడంతో గ్రామ సచివాలయం వద్దకు వెళ్లగా సర్టిఫికెట్ తీసుకు వస్తేనే పింఛన్ ఇస్తామని, లేదంటే టీడీపీ నేతలను కలిసి వారితో చెప్పించాలని చెప్పారని పేర్కొంది. స్థానిక టీడీపీ నాయకులు కొందరు రాజకీయ కక్షతోనే తనకు పింఛన్ ఇవ్వకుండా సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువచ్చి నిలిపివేయించారని ఆరోపించింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తనకు పింఛన్ నగదు ఇప్పించాలని కోరుతోంది. ఈ విషయంపై ఎంపీడీఓ కల్పనతో సంప్రదించగా, తన దృష్టికి ఈ విషయం రాలేదని, విచారణ జరుపుతామని తెలిపారు.

కాకాణి అనుచరుడు నిరంజన్‌రెడ్డి అరెస్ట్

సాక్షిప్రతినిధి, నెల్లూరు: ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా వేధింపులు, అక్రమ అరెస్ట్‌ల పర్వం కొనసాగుతోంది. తాజాగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకం ఫోర్జరీ కేసులో ప్రమేయం ఉందంటూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు నిరంజన్‌రెడ్డిని శుక్రవారం సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. మాగుంట సంతకం ఫోర్జరీ చేసి సర్వేపల్లి జలాశయం నుంచి గ్రావెల్ తరలించారని 2021లో వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్‌లో ఉదయ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్లను అప్పట్లో చేర్చారు. ఇటీవల ఆ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన పేర్లను తొలగించి నిరంజన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్లను చేర్చారు. సిట్ అధికారులు శుక్రవారం బెంగళూరులో ఉన్న నిరంజన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ఏపీకి తరలించారు. అనంతరం ఆయన వద్ద నుంచి వివరాలు సేకరించి అరెస్ట్ చేశారు. ఈ కేసులో కాకాణిని సైతం పీటీ వారెంట్‌పై సిట్ అధికారులు విచారించే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే ఓ పథకం ప్రకారమే కాకాణి గోవర్ధన్‌రెడ్డి లక్ష్యంగా అక్రమ కేసుల పరంపర కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

డీఆర్‌డీఏలో బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు (పొగతోట): డీఆర్‌డీఏలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీసీలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ నాగరాజకుమారి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు పూర్తయిన, అభ్యర్థనలు పెట్టుకున్న, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సంబంధించి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు.




స్వర్ణాల చెరువు అపరిశుభ్రం

త్వరలో ఘనంగా నిర్వహించే రొట్టెల పండగకు గడువు సమీపిస్తోంది. పండగకు బారాషహీద్ దర్గాను సందర్శించే భక్తులు సమీపంలోని స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు మార్చుకొంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న స్వర్ణాల చెరువు నేడు గుర్రపుడెక్కతో నిండి అపరిశుభ్రంగా కనిపిస్తోంది. అధికారులు స్పందించి చెరువును శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఇవి నిరుపయోగమేనా!

ప్రజల ఇంటి వద్దకు రేషన్ బియ్యాన్ని తీసుకువచ్చే ఎండీయూ వాహనాలను కూటమి సర్కారు రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో విలువైన వాహనాలు నిరుపయోగంగా మారాయి. నెల్లూరు కోటమిట్ట పరమేశ్వరినగర్ వద్ద ప్రధాన రహదారిపై కనిపించిన దృశ్యమిది.

క్లుప్తంగా

డీమ్డ్ యూనివర్సిటీగా ఆదిశంకర



మాట్లాడుతున్న ఆదిశంకర అధినేత పెంచలయ్య

నెల్లూరు (టౌన్): ఆదిశంకర గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు డీమ్డ్ యూనివర్సిటీగా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు లభించిందని ఆ విద్యాసంస్థల గ్రూపు చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. స్థానిక దర్గామిట్టలోని మినర్వా గ్రాండ్‌లో డీమ్డ్ యూనివర్సిటీ లోగోను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయలసీమ జోన్‌లో డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు పొందింది కేవలం ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల మాత్రమేనని చెప్పారు. 2001లో కేవలం 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఇంజినీరింగ్ కళాశాల నేడు 8వేల మంది విద్యార్థులతో ఉందన్నారు. కోవూరు సమీపంలోని రామన్నపాలెం వద్ద కొత్తగా ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలను 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మధ్వాచార్య, ప్రొఫెసర్లు వేణుమాధవ్, ధనుంజయ, ఏటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పడారుపల్లి సుందరయ్య కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు ఇస్కాన్‌సిటీకి చెందిన చెంచయ్య చిన్ను(28) అవివాహితుడు. ఆయన వేదాయపాలెంలోని ఓ పొక్లయిన్ కంపెనీలో స్పేర్ పార్ట్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గురువారం అర్ధరాత్రి బుజబుజనెల్లూరులో స్నేహితుడిని వదిలిపెట్టి జాతీయ రహదారి మీదుగా ఇంటికి బయలుదేరారు. పడారుపల్లి సుందరయ్యకాలనీ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో రెయిలింగ్ మీద పడ్డారు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఎస్‌ఐ మాల్యాద్రి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని అన్న రవి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి	:రూ.30
సన్నవి	:రూ.20
పండ్లు	:రూ.10

రంగూన్ కలప కొల్లగొట్టే ప్లాన్

- నిబంధనలకు విరుద్ధంగా ఎంపీడీఓ భవనం కూల్చివేత
- గుట్టుచప్పుడు కాకుండా పనిపూర్తి
- రాత్రికి రాత్రే కలపను టీడీపీ నేత ఇంటికి తరలించిన వైనం



ఎంపీడీఓ భవనాన్ని కూల్చివేసిన దృశ్యం

ఆత్మకూరు: పురాతన కట్టడాలను ఆయా ప్రాంతాల్లో స్మారక చిహ్నాలుగా ఉంచడం పరిపాటి. అయితే ఐదు రోజుల క్రితం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని శిథిలమైందన్న సాకుతో ఎలాంటి ప్రొసీజర్లు పాటించకుండా కూల్చి వేసి రూ.5 లక్షల విలువైన రంగూన్ టేకు కలపను రాత్రికిరాత్రి పట్టణం దాటించేశారు. మంత్రి అండదండలతో టీడీపీ నాయకులు ఈ కార్యక్రమం పూర్తి చేశారేమోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలు శిథిలమైతే వాటికి మరమ్మతులు చేయాలన్నా, తొలగించాలన్నా సంబంధిత ఇంజనీరింగ్ విభాగం వారు ఎస్టిమేషన్ వేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపి వారి ఆమోదం మేరకు తొలగించాల్సి వస్తే పేపరులో ప్రకటించడం, టెండర్లు నిర్వహించడం చేయాలి. కూల్చివేసే భవనాల్లో విలువైన టేకు లేదా కొయ్య పరికరాలు ఉంటే వాటిని సంబంధిత ఏఈ ఆధ్వర్యంలో భద్రపరచాలి. వాటిని అమ్మాలన్నా, ఎస్టిమేషన్లు వేసి ఉన్నతాధికారుల ఆదేశాలతో వేలం నిర్వహించాలి. ఇదంతా ఓ ప్రొసీజర్. అయితే ఆత్మకూరులో కూల్చివేసిన ఆ బ్రిటీష్ కాలం నాటి భవనం విషయంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఆరు నెలల క్రితం తీర్మానం చేసి, కూల్చివేశారని ఆరోపణలు వస్తున్నాయి.

కలప ఏదీ...?

ఈ కూల్చివేసిన భవనంలో లక్షలాది రూపాయల విలువైన రంగూన్ టేకు ఉందని పలువురు పేర్కొంటున్నారు. వాటిని సంబంధిత పంచాయతీరాజ్ ఏఈ ఆధీనంలో సురక్షితంగా ఉంచాలి. కానీ వారి కార్యాలయంలోగానీ, ఆయన ఆధీనంలోగానీ ఈ టేకు కొయ్యలు లేకపోగా, మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో ఓ ప్రైవేట్ వ్యక్తి ఆధీనంలో ఉంచినట్లు సమాచారం. అసలు ఎంత కలప వచ్చింది పరిశీలించేందుకు భవనం తొలగించే క్రమంలో సంబంధిత ఏఈ పర్యవేక్షించలేదని సమాచారం. కాగా ఈ విషయమై పంచాయతీరాజ్ డీఈఈ, ఏఈలను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. ఇన్‌చార్జి ఎంపీడీఓను సంప్రదించగా డేవిడ్‌ను సంప్రదించగా తాను ఇటీవలే ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించానని, ఈ ఏడాది జనవరిలో మండల పరిషత్ సమావేశంలో పాడుబడిన ఎంపీడీఓ కార్యాలయాన్ని కూల్చివేయాలని పీఆర్ ఏఈ రూ.1.68 లక్షలకు కూల్చివేతకు ఎస్టిమేషన్ వేసి రికార్డులో నమోదు చేసినట్లు తెలిపారు. భవనంలో వచ్చిన పాత కలపను సేకరించి ఏఈ ఆధ్వర్యంలో భద్రపరచాలని, దానిని వేలం వేస్తే రూ.1.96 లక్షల విలువ తగ్గకుండా వేయవచ్చునని ఏఈ తెలిపినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వివరించారు. ప్రస్తుతం ఏఈ ఆధీనంలో కలప ఉందన్నారు.



ఓ ప్రైవేట్ వ్యక్తి ఆధీనంలో ఉన్న తొలగించిన భవనానికి చెందిన కలప

యోగ జీవితంలో భాగం కావాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్



యోగాసన వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మానసికంగా, శారీరకంగా అద్భుత ప్రయోజనాలు కలిగించే యోగాను ప్రతిఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన రెసిడెన్షియల్ థీమాటిక్ రాష్ట్రస్థాయి సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్ హాజరుకాగా, జ్యోతి ప్రజ్వలనతో యోగాసనాలను ప్రారంభించారు. యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో చిన్నారులు సాధన్, దివ్య వేసిన యోగాసనాలు అందరినీ ఔరా అనిపించాయి. ప్రతి ఆసనానికి తగిన విధంగా శరీరాకృతిని అవలీలగా మారుస్తూ వేసిన ఆసనాలు ప్రత్యేకతను చాటాయి. ప్రజలందరూ కూడా యోగాను ఒక దినచర్యగా మార్చుకోవాలనేది ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశంగా కలెక్టర్ చెప్పారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లాలో 2వేల ప్రదేశాల్లో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారి యతిరాజ్, జిల్లా ఆయూష్ అధికారి గోవిందయ్య, యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.

మరో కరోనా కేసు నమోదు



- పెద్దాస్పత్రిలో మినహా కరోనా పరీక్షలు ఎక్కడ?
- ఇక్కడ కూడా అనుమానం వస్తేనే.. లేదంటే అంతే
- జిల్లాలో 7కి చేరిన కేసులు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో చాపకింద నీరులా కరోనా కేసులు వ్యాప్తి చెందుతున్నాయి. గురువారం ఒక్క రోజే 6 మందికి కరోనా నిర్ధారణ కాగా, శుక్రవారం దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో 27 మంది అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా మరొకరికి కరోనా నిర్ధారణ అయింది. నెల్లూరు మూలాపేటకు చెందిన 22 ఏళ్ల యువకుడికి కరోనా నిర్ధారణ కావడం, అతనికి స్వల్ప లక్షణాలుండడంతో హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఇప్పటికి మొత్తం 7 మందికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో జిల్లా ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీటింగ్ ఎక్కడ?

జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు) 2 ఏరియా ఆస్పత్రులు, ఆత్మకూరులో ఒక జిల్లా ఆస్పత్రి ఉన్నాయి. వీటిల్లో ఎక్కడా కరోనా పరీక్షలు చేయడం లేదు. నెల్లూరులోని పెద్దాస్పత్రిలో మాత్రమే అనుమానం వస్తేనే కరోనా పరీక్షలు చేస్తున్నారు. టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీటింగ్ ప్రక్రియ ఎక్కడా జరగడం లేదు. దీంతో ఇతర ప్రాంతాల్లో కరోనా కేసులు వ్యాప్తి చెందుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా రోజురోజుకు విస్తరిస్తున్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం కనీసం పరీక్షలు కూడా చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. 2020 మార్చి 8న రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో కరోనా కేసు వెలుగు చూసింది. నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో కరోనా పరీక్షలు చేసేలా చర్యలు చేపట్టింది. అప్పట్లో కరోనా కేసులు వెలుగు చూసిన చోట ప్రతి రోజు వైద్యశాఖ సిబ్బంది వారికి తగిన మందులు ఇచ్చి రోజూ పర్యవేక్షించేవారు. ఇప్పుడు కరోనా సోకిన వారి సంగతి పట్టించుకోవడం మానేశారు. ఇకనైనా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

డీఈఓ ఆఫీసు ముందు ఏపీటీఎఫ్ నిరసన

- ఎస్‌ఏ బదిలీల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణ



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్లలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ముందు పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ తొలుత నుంచి ఒక ప్రహసనంగా మారిందన్నారు. తాజాగా విడుదల చేసిన బదిలీ ఉత్తర్వుల్లో సీనియర్ టీచర్లకు అన్యాయం జరిగిందన్నారు. ఎక్కువ పాయింట్లు వచ్చిన ఉపాధ్యాయులకు దూర ప్రాంతాలు, తక్కువ పాయింట్లు వచ్చిన వారికి దగ్గర్లో ఉన్న క్లస్టర్ వేకెన్సీలు కేటాయిండం దుర్మార్గపు చర్యన్నారు. స్కూల్ అసిస్టెంట్లకు పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మాదిరి క్లస్టర్ పోస్టులకు విల్లింగ్ ఇచ్చి ఆప్షన్లు పెట్టుకున్న వారికి క్లస్టర్ వేకెన్సీలు కేటాయించి వుంటే బాగుండేదన్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఉన్న ఉపాధ్యాయులకు జనరల్‌లోకి వచ్చి ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉన్నా వారికి ప్రిఫరెన్షియల్ స్థానాలు మాత్రమే కేటాయించారన్నారు. స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన అవకతవకలు రివైజ్ చేసి సీనియర్ టీచర్లకు న్యాయం చేయాలన్నారు. ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లకు స్వస్తి చెప్పి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, నాయకులు ఆలీ, రియాజ్, వెంకటేశ్వర్లురెడ్డి, గురవయ్య, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మహిళకు తీవ్ర గాయాలు

ఉదయగిరి: స్థానిక ఆనకట్ట సమీపంలో ఓ మహిళ ప్రమాదవశాత్తు జారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో మంటల చెలరేగి తీవ్రంగా గాయపడింది. మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ పట్టణంలోని పలు ఇళ్లలో పాచిపనులు చేసుకుంటూ సాయంత్రానికి స్వగ్రామానికి చేరుకునేది. ఈ క్రమంలో శుక్రవారం కూడా పాచిపనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్లేందుకు ఆనకట్ట మీదుగా వెళుతుండగా రోడ్డుపక్కనే గుంతలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రాగానే ఆమె కాలుజారి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దాంతో పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి ఎస్సై ఇంద్రసేనారెడ్డికి, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగా వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని నరసమ్మను చికిత్స నిమిత్తం ఆటోలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. నరసమ్మ కుమార్తె శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో శుక్రవారం మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం చల్లాయపాలెం గ్రామానికి చెందిన గోళ్ల రుత్యేంద్రబాబు అలియాస్ నాని, అదే జిల్లాకు చెందిన ఓబిలి నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. నాని మీద రౌడీషీట్‌తో పాటు రెండు హత్యకేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కళ్లలో కారంకొట్టి బంగారం అపహరణ

సంగం: పొలం గట్టుపై సేదతీరుతున్న ఓ మహిళ కళ్లలో కారంకొట్టి బంగారాన్ని అపహరించిన ఘటన శుక్రవారం మండలంలోని జెండాదిబ్బ గ్రామ పొలాల్లో చోటు చేసుకుంది. బాధితురాలు ఆదిలక్ష్మమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల మేరకు బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఆమెకు జెండాదిబ్బ గ్రామంలో పొలం ఉంది. శుక్రవారం పొలంలో కూలీలతో పనులు చేయించి వారు వెళ్లిపోవడంతో గట్టుపై కూర్చుని సేదతీరుతుండగా గుర్తు తెలియని ఓ యువకుడు ఆమె వద్దకు వచ్చి కళ్లలో కారంకొట్టి నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత శుక్రవారం మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు బీవీనగర్ సప్తగిరి కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, నాగరత్నమ్మ(44)లు దంపతులు. వారి చిన్న కుమారుడు మాట వినలేదన్న క్షణికావేశంలో గత నెల 23వ తేదీన నాగరత్నమ్మ ఇంటి బాత్‌రూమ్‌లు శుభ్రంచేసే యాసిడ్ తాగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను నారాయణ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం మృతిచెందారు. ఈ మేరకు మృతుని భర్త వెంకటేశ్వర్లు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.